

బోనం.. భక్తజన సందోహం

- వైభవంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర
- వర్షంలోనూ అమ్మవారి దర్శనం కోసం భక్తుల బారులు





సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి జాతర అదివారం అత్యంత వైభవంగా సాగింది. లష్కర్ బోనాల జాతర జనజాతరగా మారింది. తెల్లవారు జాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పోటెత్తారు. బోనాల క్యూ లైన్లతో పాటు వీఐపీ, సాధారణ భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్లు కిటకిటలాడాయి. ఉదయం కొద్దిగా భక్తుల సందడి తక్కువగా కనిపించినా మధ్యాహ్నం వరకు క్యూలైన్లు నిండిపోయాయి. సాయంత్రం ఒక వైపు వర్షం కురుస్తున్నా వర్షాన్ని లెక్క చేయకుండా భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. క్యూ లైన్లలో కూడా తోపులాటలు జరుగకుండా భక్తులు సాఫీగా వెళ్లారు. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర, మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక, పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు.

-రాంగోపాల్‌పేట్





















కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్







అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో పని చేస్తున్న అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగులను (బోధనేతర) పర్మనెంట్ చేయాలని ఎన్‌జీవోస్ అధ్యక్షులు బియ్యాని జ్ఞానేశ్వర్ ఆదివారం డిమాండ్ చేశారు. డిగ్రీ, పీజీ ఉన్నత విద్య అర్హతలతో తక్కువ వేతనానికి 25 ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వెట్టి చాకిరి చేయించడం సరికాదన్నారు. ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయనే ఆశతోనే తెలంగాణ ఉద్యమంలో కాంట్రాక్టు సిబ్బంది కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

విద్యతోనే సమాజంలో మార్పు



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని మాజీ ఐఏఎస్ అధికారి అకునూరి మురళి అన్నారు. ఆదివారం ఆంధ్రమహిళా సభ డిగ్రీ కాలేజీలోని ఎంవీ హాల్‌లో జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్య, వైద్య రంగాలు-సవాళ్లు అనే అంశం పై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆకునూరి మురళి మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో ఉంటేనే పేదలకు ఉచిత సేవలందుతాయన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ చట్టం ఒకటే అయినా పేదలకు, ధనికులకు సమానంగా అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ విరించి విరివింటి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు నేలకొరిగిన భారీ చెట్టు

చిలకలగూడ : రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లో భారీ చెట్టు నేలకొరిగింది. స్థానిక కార్పొరేటర్ సామల హేమ అందించిన సమాచారం మేరకు జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎస్ బృందాలు ఆదివారం ఘటన స్థలానికి చేరుకుని నేలకొరిగిన చెట్టును తొలగించారు. ఈ ఘటనలో ఓ ఇంటి ప్రహరీగోడ స్వల్పంగా కూలింది. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని కార్పొరేటర్ హేమ తెలిపారు.

అల్లర్లకు యత్నం.. 8 మంది అరెస్ట్

అమీర్‌పేట: ఇటీవల జరిగిన బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవ వేడుకల్లో అల్లర్లు సృష్టించేందుకు యత్నించిన యువకులనుఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు..గత యేడాది జరిగిన కల్యాణ వేడుకల్లో జరిగిన కత్తిపోట్ల నేపథ్యంలో అల్లరి మూకలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. గతంలో జరిగిన గొడవలతో సంబంధం ఉన్న 50 మందిని ముందస్తుగా బైండోవర్ చేయడంతో పాటు రథోత్సవం రోజున అనుమానాస్పదంగా తిరుగుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద మూడు కత్తులు,43 గ్రాముల గంజాయి, హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నేరెడ్‌మెట్‌కు చెందిన డీజే బాయ్ కె.అర్జున్, బోవెన్‌పల్లికి చెందిన హరీష్, బాలానగర్‌కు చెందిన కౌశిక్, కవాడిగూడకు చెందిన జక్కుల సాయికుమార్ యాదవ్, పీరం చెరువుకు చెందిన అరుణ్, సనత్‌నగర్ కు చెందిన సయ్యద్ హమీద్ ,బీకేగూడకు చెందిన కె.ప్రసన్న,బోరబండకు చెందిన ప్రణయ్‌లను అరెస్టు చేశామన్నారు.

తెలంగాణ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి



ఉజ్జయినీ అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలతశోభన్‌రెడ్డి దంపతులు

లాలాపేట: సికింద్రాబాద్ లష్కర్ బోనాల జాతర సందర్భంగా ఆదివారం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు వారికి ఆశ్వీరచనాలు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు



మైలార్‌గడ్డ సాయిబాబా ఆలయంలో ..

చిలకలగూడ : మైలార్‌గడ్డలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఛైర్మన్ మింగు వెంకటసాయికుమార్ (నైవేద్యంసాయి) నేతృత్వంలో జరిగిన వేడుకల్లో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ బీఆర్ఎస్ నాయకుడు కరాటే రాజు, కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ నోముల ప్రకాశరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయంలో..

మంత్రి మెప్పు కోసం అధికారుల అత్యుత్సాహం

అమీర్‌పేట: రాష్ట మంత్రి మెప్పు కోసం బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఉదయం అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్నారన్న సమాచారంతో ఆలయ అధికారులు దర్శనాలను నిలిపివేశారు. వీఐపీ, రూ.50 దర్శనాల క్యూలైన్‌లో నిలుచున్న వారిని సైతం చాలా సేపటి వరకు లోపలకు అనుమతించలేదు. దీంతో మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒక్క వీఐపీ కోసం ఇతర భక్తులను గంటల తరబడి దర్శనాలకు అనుమతించక పోవడం ఏమిటని ఆలయ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి



సనత్‌నగర్‌లో..

సనత్‌నగర్: గురుపౌర్ణమి మహోత్సవాలు సనత్‌నగర్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ఉత్సవాలను పురస్కరించుకుని సాయి మందిరాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కాగడ హారతి, గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, సాయిసత్య వ్రతం, విష్ణుసహస్ర నామ పారాయణం వంటి కార్యక్రమాలు కొనసాగాయి. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిపారు. సాయంత్రం బాబాను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఊరేగించారు. కాగా గురుపౌర్ణమిని పురస్కరించుకుని పలు విద్యా సంస్థల్లో గురువులను సన్మానించారు.

డాక్టర్ శ్రీ పూజకు సన్మానం



సాక్షి, సిటీబ్యూరో: భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. అమీర్‌పేట ఆదిత్య ట్రేడ్ సెంటర్‌లోని రీజనల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పీహెచ్‌డీ స్కాలర్స్‌కు గైడ్ చేసిన టీపీఏ స్టేట్ ట్రెజరర్, క్లినికల్ సైకాలజిస్ట్, ఆర్‌సీఐ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీపూజ సిద్ధంశెట్టిని సన్మానించారు. జ్ఞాపికను అందించారు.

మద్యం తాగించి బైక్, ఫోన్ చోరీ

వెంగళరావునగర్: మద్యం తాగించి రాపిడో డ్రైవర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి బైక్, ఫోన్ చోరీ చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నెల్లూరు ప్రాంతానికి చెందిన కె. సురేష్ మధురానగర్‌కాలనీ హాస్టల్‌లో ఉంటూ ర్యాపిడో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 19న సాయంత్రం విధులు ముగించుకుని యూసుఫ్‌గూడ కల్లు కాంపౌండ్ ప్రాంగణంలో తన వాహనాన్ని నిలిపి కల్లు తాగాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కలిసి విస్కీ తాగుదామని సలహా ఇచ్చాడు. దీంతో ఇద్దరూ తాగిన తర్వాత సురేష్‌కు ఫోన్ రాగా పక్కకు వెళ్లి ఫోన్ మాట్లాడి వచ్చేలోగా గుర్తు తెలియని వ్యక్తి కనిపించలేదు. తన వాహనం కోసం పార్కింగ్ స్థలానికి వెళ్ళగా వాహనంతో పాటుగా అందులో ఉంచిన మరో ఫోన్ కనిపించ లేదు. కంగారుగా అతని కోసం చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉజ్జయినీ అమ్మవారికి.. పట్టు వస్త్రాల సమర్పణ

లంగర్‌హౌస్: అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్నామని గోల్కొండ జగదాంబిక బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేష్‌కుమార్ అన్నారు. జగదాంబిక ఆలయం తరపున ఆయన ఆధ్వర్యంలో ఆదివారం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కమిటీ సభ్యులు శ్రీకాంత్, రాకేష్, జగదీష్‌యాదవ్, కార్తీక్, నరేష్, శోభాపాండే, అనిల్‌యాదవ్ ఉన్నారు.



ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు ఆపొద్దు



విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితులను రానీయవద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వెజిటెబుల్ మార్కెట్ భవనంలోని ఈ-లైబ్రరీలో వద్ద ఆదివారం 12 మంది పేద విద్యార్థులకు రూ.2.30 లక్షల ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక మంది పేదరికం, ఆర్థిక సమస్యల కారణంగా ఎంతో భవిష్యత్తు ఉన్న తమ పిల్లలను మధ్యలోనే చదువును మాన్పిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను విద్యలో ప్రోత్సహించాలనే లక్ష్యంతో సంకేత్ సంస్థ ఆధ్వర్యంలో గత 8 సంవత్సరాల నుంచి ఆర్థిక సహాయం అందిస్తుండడం పట్ల నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో భీమ్ ఆర్మీ ఆవిర్భావ దినోత్సవం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో భీమ్ ఆర్మీ 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం భీమ్ ఆర్మీ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధ్యక్షులు తీగ శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఎగురవేసి మాట్లాడారు. శేఖర్, ఎర్ర సురేందర్, ప్రశాంత్, వంగేరి ప్రభాకర్, మహేందర్, చుక్క విశాల్ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక అలంకారం



లాలాపేట: తార్నాక చౌరస్తాలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సాయిబాబను 15 రకాలైన డ్రైఫ్రూట్స్‌తో అందంగా అలంకరించారు.